కొట్టుకునే అత్తకోడండ్లను జూస్తం గానీ.. ఈళ్ల లెక్క ఒక రంటే ఒకరు పానమిచ్చుకునే అత్తకోడండ్లను ఏడభీ సూడం. ముసిలామేమో జారిపడి కాలిరుసుకుని ఇంటి కాడనే ఉంది. పిచ్చి పనో మంచి పనో నాకైతే ఎరికైత లేదు గానీ, గిప్పుడైతే గీమెను తీస్కపోవుడైతె తప్పదు. బీబీనగర్ మా ఊరు. చెప్పు నాయినా! ఎంతియ్యమంటవు?'' పరిస్థితి అంతా వివరించి చెప్పి, అడిగాడు మల్లయ్య.

పరమేశ్ తల పంకించి, కళ్లు మూసుకుని, కనుకొలకులలో వేళ్లు గుచ్చుకుని, దీర్ఘంగా ఆలోచిస్తూ రెండు నిమిషాలుండి, చాలా నిజాయతీగా అడుగుతూన్న ధోరణిలో..



''చూడు పెద్దాయనా! చీకటి పడింది. వాన గూడ వస్తాంది. గీ రాత్రి పూట పేషంట్‌ను, మిమ్ములిన్ని జాగర్తగ మీ ఊరు తీస్కపోయి వదిలి, మల్ల నేను హైదరాబాదు తిరిగి రావాలె. నిజానికైతే నేనిప్పుడు వచ్చే పరిస్థితైతే లేదు. నర్సిమ్మ జెప్పిండని, మీ పరిస్థితి జూసి జాలిపడి రావాలె. ఊc..'' అంటూ సాగదీస్తూ మళ్లీ ఓ నిమిషం ఆలోచించి, తెగించి నిర్ణయం తీసుకున్నట్లు ఒక్కసారి తల విదిల్చి..

''సరే పోదం! ఇరవై వేలియ్యుని'' అన్నాడు.

పక్కలో బాంబు పేలినట్లు అదిరిపడ్డాడు మల్లయ్య.

''ఇ..ర్..వై వేలా?!!''..

''ఏంది గట్ల ఉలిక్కిపడినవ్? 'ఇరవై వేలా' అంటూ! అది శాన తక్కువ. గిదే కరోన టైమైతే.. యాభై వేలు తీస్కుంటుంటిమి. ఇన్నవా? అసల్కు నేను వచ్చే పరిస్తితైతే లే! నా కొడుకు యాపీ బర్త్‌డే ఇయ్యాల. ఇంటికిబోయి, ఆని దోస్తులకు దావత్ ఇయ్యాల్సుండే. కానీ, మిమ్ములిన్ని తీస్కపోకపోతే నర్సిమ్మన్న ఫీలైతడని వస్తా అన్న. గంతే!''.

తెరుచుకున్న నోటిని ప్రయత్నం మీద మూస్తూ..

''గంత నేను ఇచ్చుకోలేనయ్య. దగ్గరనే గదా.. ఏదో నాలుగైదు వేలైతే...'' నీళ్లు నమిలాడు మల్లయ్య.

''నాలుగైదు వేలు సిటీలో దించుడుకే ఇస్తరు!'' అని ఓ క్షణం ఆగి..

''ఏందీ చుట్టూ జూస్తున్నవు? వేరే అంబులెన్స్ ఎవుల్లన్న వస్తరేమోననా? రాత్రి సమయంల.. వానల.. ఎవ్వల్ రారు. వచ్చినా.. నేన్జెప్తున్న ఇను పెద్ద మడిసీ.. అంతా బద్మాష్‌గాళ్లు ఈడ. దార్ల కిరికిరి వెడుతరు. నీ భార్యను దిక్కుమొక్కులేని సోట జంపుకొనుడైతది జెప్తున్న. తర్వాత నీ ఇట్టం మల్ల'' అన్నాడు పరమేశ్.. బెదిరింపు అస్త్రం ప్రయోగిస్తూ కచ్చితంగా.

మతి పనిజెయ్యడం మానేసింది మల్లయ్యకు. యాంత్రికంగా తలుపు తీసుకుని కిందికి దిగాడు.

''ఆలోచించుకుని, పది నిమిషాల్ల చెప్పాలె పెద్దాయినా! నేను గీడనే ఉంట. నేను శానా తక్కువ అడిగిన. వేరెవ్వల్లూ రారు!'' అరిచాడు పరమేశ్ వెనగ్గా.

అతగాడికి తెలుసు.. తనను కాదని ముందుకు వచ్చే మరో అంబులెన్స్ డ్రైవర్ అక్కడ ఎవ్వరూ లేరని.

యాంత్రికంగా అడుగులు వేస్తూ హాస్పిటల్లోకి నడిచాడు మల్లయ్య. డీలా పడ్డ మొహంతో తిరిగి వచ్చిన తండ్రిని చూసి..

''ఏమైందయ్యా?'' అనడిగింది పుష్ప.

''గా అంబులెన్సాయన మస్తు పైసలడుగుతాండు బేటా!'' నిరాశ కారణంగా మల్లయ్య గొంతు లోతైన బావిలోంచి మాట్లాడుతున్నట్లు ధ్వనించింది.

''ఎంత?''.

''ఇరవై వేలు.. 'రాత్రేల.. వాన పడతున్నది. మల్ల నేను అయిద్రాబాదుకు ఊకెనే వాపసు రావాలె!' అంటున్నడు!''.

''ఇరవై వేలా?!'' అప్రయత్నంగా పుష్ప చెయ్యి గుండెల మీదికి చేరింది.

''అవ్ బిడ్డా! ఒక్క పైస తగ్గడట. ఏంజెయ్యాల్నో అర్తమైతలేదు!''.

పుష్ప దృష్టి సన్నగా మూలుగుతూన్న తల్లి మీదికి మళ్లింది. సారమ్మ మొహంలో ఇందాక ఉబికిన ఆ కొద్దిపాటి ఆనందం స్థానంలో నిరాశ, దిగులు కనిపిస్తున్నాయి. చనిపోయేలోగా అత్తమ్మను చూడాలన్నది బహుశా ఆమె ఆఖరి కోరికే కావచ్చు. కూతురితోబాటు భార్య మొహంలోని బెంగతో కూడిన నిరాశను మల్లయ్యా చదివాడు. పుట్టెడు దుఃఖం తన్నుకొస్తున్నది లోనుంచి.

గబుక్కున ఒక్కసారిగా అడిగింది పుష్ప..

''అయ్యా! గా రాంలాల్ సేఠ్ తాన నాకోసం పదారు వేలు దాచినవ్ గదా?''.

కనుబొమలు ముడిచి చూసి..

''అయి ఇంటి మీద సేసిన అప్పు బిడ్డా! నీ పెండ్లికని దాచిన. అంతా మంచిగుంటే వచ్చే నెల్ల నీ పెండ్లి చేయాలనుకుంటి. గింతల..'' అని తండ్రి అంటుండగానే వారించి..

''గిప్పుడు నా పెండ్లికైతే తొందరేం లేదు.. గా పైసలు, మన తానున్న పైసలు కలిపి ఇద్దంలే! తీస్క రమ్మను అంబులెన్స్‌ను'' అన్నది పుష్ప. దృఢ నిశ్చయంగా.

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.**